క్లుప్తంగా

పచ్చిరొట్ట ఎరువులను సకాలంలో కలియదున్నాలి



మొగలిపాలెంలో పూత దశకు చేరుకున్న పచ్చిరొట్ట పైరు

కాజులూరు: పచ్చిరొట్ట ఎరువులను సరైన సమయంలో పొలంలో కలియదున్నాలని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. శుక్రవారం గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ డెల్టాలో కొందరు రైతులు దాళ్వా సాగు అనంతరం అపరాల సాగు చేపట్టగా కొందరు రైతులు పొలంలో భూసారం వృద్ధి కోసం జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పచ్చిరొట్ట ఎరువులను సాగు చేస్తున్నారన్నారు. మండల గ్రామాల్లో రైతులు సాగుచేసిన పచ్చిరొట్ట పైర్లు ప్రస్తుతం దాదాపు ఏపుగా ఎదిగి కలియదున్నే దశలో ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట మొక్కలు గట్టిపడితే పొలానికి మేలు కంటే కీడు ఎక్కువగా జరుగుతుందన్నారు. ఈ సమయంలో పచ్చిరొట్ట పైర్లను కలియదున్నడం ద్వారా పొలాల్లో మలి సాలు దమ్ము చేసే నాటికి అవి పూర్తిగా చీకిపోయి మట్టిలో కలుస్తాయన్నారు. పూత దశకు రాకముందే పచ్చిరొట్ట మొక్కలను కలియదున్ను కోవాలంటున్నారు.

సప్లిమెంటరీ పరీక్షకు 80 మంది గైర్హాజర్

మండపేట: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు మండలంలో తొలి రోజైన శుక్రవారం 93 మంది విద్యార్థులు హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారి నాయుడు రామచంద్రరావు తెలిపారు. మండలం నుంచి మొత్తం 173 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉందన్నారు. శుక్రవారంలో పట్టణంలోని మూడు పరీక్ష కేంద్రాల వద్ద నిర్వహించిన తొలి పరీక్షకు 93 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆయన తెలిపారు. మిగిలిన 80 మంది పరీక్షకు హాజరు కాలేదని ఎంఈవో రామచంద్రరావు తెలియజేశారు.

గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే



కపిలేశ్వరపురం ఆర్‌కే నగర్‌లో చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికులు

కపిలేశ్వరపురం: మండలంలోని 19 గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం సందర్భంగా ప్రత్యేక పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఎంపీడీఓ కొండలరావు ఆదేశాలపై పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రజారోగ్యంపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులు చెత్తను తొలగించారు. దోమల ఆవాసాలపై వైద్య ఆరోగ్య కార్యకర్తలు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు.

సేవలను పునరుద్ధరించాలి

మండపేట: పేదల ఆరోగ్య పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆరోగ్యశ్రీ సేవలను పునరుద్ధరించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దూలి జయరాజు మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూడు రోజులుగా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు రాష్ట్రమంతటా నిలిచి పోవడంతో రోగులు, ప్రమాద బాధితులు ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. అలాగే రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేసే ఆసుపత్రుల యాజమాన్యం ఉన్న పళంగా వైద్య సేవలను బంద్ చేయడం సబబు కాదన్నారు.

ప్లాస్టిక్ ఉత్పత్తులను నిషేధించాలి

మండపేట: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నిషేధించేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని బీజేపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ కోరారు. బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మండపేట పట్టణం, పరిసర గ్రామాల్లోను ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగి పోయిందన్నారు. ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, బాటిల్స్ కనిపిస్తున్నాయన్నారు. పట్టణంలోని డ్రెయిన్ నిండా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, బాటిల్సే దర్శనమిస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ అధికారులు నియంత్రణకు కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

మలేరియా నివారణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలి

ఆలమూరు: వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ప్రస్తుత సీజన్‌లో సంభవించే మలేరియా జ్వరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సారించాలని కొత్తపేట డివిజన్ మలేరియా సబ్ యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన ఆలమూరులోని మూడు గ్రామ సచివాలయ పరిధిలో ఇటుక బట్టీ కార్మికుల కుటుంబాలను సందర్శించి పలువురికి మలేరియా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మలేరియా వ్యాప్తి చెందే విధానంపై అవగాహన కల్పించారు. అలాగే స్థానిక గ్రామ సచివాలయం ఆవరణలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో వైద్యాధికారి డి.సాయికిషోర్ నిర్వహించారు.

మూగజీవాల బాధ్యత మనిషిదే..

- అగ్ని ప్రమాదాల్లో తరచూ పశువుల మృతి
- వాటి సంరక్షణలో నిర్లక్ష్యం వీడాలి
- పొలాల్లో గడ్డి తగలబెట్టడమూ ఓ కారణం



2020 మే 26న టేకిలో పశువుల పాక దగ్ధమై మృతి చెందిన పశువులు (ఫైల్)

కపిలేశ్వరపురం: మూగ జీవుల సంరక్షణ కూడా మానవుల బాధ్యతే. కష్టం కలగగానే నోటితో బాధను వ్యక్తం చేసే వీలు మనుషులకు ఉంది. ఆ అవకాశం లేని మూగజీవాల పట్ల సంరక్షకులు మరింత జాగ్రత్త, ప్రణాళికతో వ్యవహరించాలి. దానికితోడు మండు వేసవిలో పశువుల పాకలు, గడ్డివాములు తగలబడే ప్రమాదం పొంచి ఉంటుంది. వ్యవసాయ క్షేత్రాల్లో గడ్డిని తగలబెట్టడం ప్రమాదభరితం. మానవ తప్పిదాలను అధిగమించి పశువులను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. రోహిణి కార్తె వేళ పశు ప్రమాదాల నివారణపై ఈ కథనం...

ప్రమాదాలు అనేకం

వ్యవసాయ క్షేత్రాల్లోనూ, పశువుల మకాంలలోనూ మానవ తప్పిదాల వల్ల పశువులు ప్రమాదాలకు గురవుతున్నాయి. గతేడాదిలో పలు ప్రాంతాల్లో సంభవించిన ప్రమాదాల్లో పశువులు మృత్యువాత పడ్డాయి. 2023 ఫిబ్రవరి 1న రాయవరం మండలం చెల్లూరు శివారు సూర్యారావుపేటలో ఒక గేదె చనిపోగా మరో రెండు గేదెలు తీవ్రంగా గాయపడ్డాయి. 2023 మార్చి 17న కె.గంగవరం మండలం కుందూరు శివారు కుందూరులంకలో పశువుల పాక దగ్ధమై రెండు ఒంగోలు జాతి ఆవులు చనిపోయాయి. ఆ తర్వాత సైతం అనేక ప్రమాదాలు సంభవించాయి.

పొలంలో గడ్డికి నిప్పు పెట్టడం వల్ల..

2020 మే 20న అంగరలో రెండు ఎకరాల ధాన్యపు రాశి, మూడు గడ్డివాములు దగ్ధమయ్యాయి. 2020 మే 26న కపిలేశ్వరపురం మండలం టేకిలో రెండు పశువుల పాకలు తగలబడడంతో ఆరు పశువులు మృతి చెందాయి. 10 ఎకరాల్లోని గడ్డివామి కాలి బూడిదైంది. సుమారు రూ.ఐదు లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. 2019 మే 16 రాయవరం మండలం, చెల్లూరులో పశువుల పాక దగ్ధమై ఒక పాడి గేదె చనిపోయింది. 2019 మే 17న కపిలేశ్వరపురం మండలం వెదురుమూడి గ్రామ శివారు తాళ్లపాలెం పుంత ఓఎన్‌జీసీ వద్ద గ్రామంలో పశువుల పాక దగ్ధమై రెండు గేదె దూడలు మృత్యువాత పడ్డాయి. మరో రెండు పాడి గేదెలకు 50 శాతం గాయాలయ్యాయి. ఒక గేదె స్వల్ప గాయాలతో బయట పడింది. రూ. 2.40 లక్షల ఆస్థి నష్టం వాటిల్లింది. 2018 మే 5న రాయవరం మండలం వెదురుపాకలో సంభవించిన ప్రమాదంలో 12 ఎకరాల్లోని ధాన్యం రాశులు అగ్నికి ఆహుతయ్యాయి.

అగ్నిమాపక దళ సిబ్బందికి ఇబ్బందులు

వ్యవసాయ క్షేత్రంలో మంటలను ఆర్పేటపుడు అగ్నిమాపక దళ సిబ్బందికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. విశాలమైన వ్యవసాయ క్షేత్రంలో నిప్పు రాజుకోగానే క్షణాల్లో ప్రమాద తీవ్రత పెరిగిపోతుంది. ప్రమాద ఘటనా స్థలం వ్యవసాయ క్షేత్రం కావడంతో వాహనం నుంచి దూరంగా నీళ్లను చల్లడం సమస్యతో కూడుకున్నది. ఒకే సమయంలో రెండు చోట్ల ప్రమాదాలు సంభవించినప్పుడు సిబ్బందికి ఏమీ పాలుపోని పరిస్థితి తలెత్తుతుంది.

అగ్నిమాపక దళాల సామర్థ్యమిలా...

ఒక్కో నియోజకవర్గంలో ఒక్కో అగ్నిమాపక కేంద్రం చొప్పున రెండు కేంద్రాలున్నాయి. మండపేట కేంద్రం సిబ్బంది మండపేట పట్టణం, రూరల్, కపిలేశ్వరపురం, ఆలమూరు, తూర్పు గోదావరి జిల్లాలోని కడియం, అనపర్తి మండలాల పరిధిలోని 60 గ్రామాల్లో సేవలందిస్తున్నారు. ఆ కేంద్రంలో 9 మంది ఫైర్‌మెన్లు ఉండాలి ఉండగా, ప్రస్తుతం ఏడుగురు మాత్రమే ఉన్నారు. ఇద్దరు డ్రైవర్లు ఉండగా మరో పోస్టు ఖాళీగా ఉంది. ఇక రామచంద్రపురం అగ్నిమాపకదళం సిబ్బంది రామచంద్రపురం పట్టణం, రూరల్ గ్రామాలు, కె.గంగవరం, కరప, బిక్కవోలు, రాయవరం మండలాల్లోని 105 గ్రామాలకు సేవలందిస్తున్నాయి. ఈ కేంద్రంలో 9 మంది ఫైర్‌మెన్లు ఉండాల్సి ఉండగా నాలుగు పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

చిన్నారులకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు అందిద్దాం



పోటీల్లో గెలుపొందిన చిన్నారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న తొగరు మూర్తి

రామచంద్రపురం: నేటి బాలలే.. రేపటి పౌరులు అన్న నానుడిని దృష్టిలో పెట్టుకుని చిన్నారులకు ఆరోగ్యకరమైన భవిష్యత్తుని అందించడానికి తల్లిదండ్రులు చర్యలు చేపట్టాలని వాకర్స్ క్లబ్ గౌరవాధ్యక్షుడు తొగరు మూర్తి అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో శుక్రవారం సూర్య నమస్కారాలు, యోగా ఆసనాలపై చిన్నారులకు పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులను సెల్‌ఫోన్‌లకు బానిసలుగా చేయకుండా తల్లిదండ్రులు బాస్కెట్ బాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్ వంటి క్రీడలు, యోగా, ప్రాణాయామం వంటి విద్యల్లో ప్రోత్సహించాలన్నారు. ప్రతిరోజూ కృత్తివెంటి పేర్రాజు క్రీడా ప్రాంగణంలో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు సూర్య నమస్కారాలు, యోగాసనాలు, ప్రాణాయామం వంటి కార్యక్రమాలు ఉచితంగా నేర్పించడం జరుగుతుందన్నారు. చిన్నారులు, యువతీయువకులు సద్వినియోగం చేసుకుని దేశ భవిష్యత్తులో భాగస్వాములు కావాలని కోరారు.

ముసురుతో మూతపడిన బట్టీలు



ఇటుక ముద్దలపై బరకాలు కప్పిన దృశ్యం

కపిలేశ్వరపురం: నాలుగు రోజులుగా ముసురు కమ్ముకోవడంతో మండలంలోని ఇటుక బట్టీలు మూతపడ్డాయి. శుక్రవారం సాయంత్రం ఉన్నట్టుండి ఒక్కసారిగా మేఘావృతమైంది. ఈదురు గాలులు వీయడంతో జనజీవనం స్తంభించింది. సుమారు గంట పాటు ఇదే పరిస్థితి నెలకొనడంతో పశువుల సంరక్షణలో ఉన్న పాడిరైతులు, చిరువ్యాపారులు, వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు అవస్థ పడ్డారు. తేలికపాటి వర్షం కురిసింది. దీంతో మండలంలోని కేదారిలంక, వీధివారిలంక, అద్దంకివారిలంక, అంగర, పడమర ఖండ్రిక, వెదురుమూడి, కపిలేశ్వరపురం, తాతపూడి, వల్లూరు, నల్లూరు, తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. వెదురుమూడి, అంగర, పడమర ఖండ్రిక, కపిలేశ్వరపురం గ్రామాల్లోని ఇటుక బట్టీలు మూతపడ్డాయి. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి వచ్చిన వలస కూలీలకు పనిలేని పరిస్థితి నెలకొంది. ఇటుక ఉత్పత్తి నిలిచిపోవడంతో బట్టీ యజమానులు సైతం ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

సోమేశ్వరస్వామివారికి శ్రీపుష్పయాగం



పుష్పయాగం సందర్భంగా ప్రత్యేక అలంకరణలో బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి



ఉత్సవ విగ్రహాలకు ఊంజల్ సేవ చేస్తున్న భక్తులు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలోని శ్రీ బాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి వారికి శుక్రవారం రాత్రి ఘనంగా పుష్పయాగం నిర్వహించారు. స్వామి వారి వార్షిక కల్యాణోత్సవంలో భాగంగా ఆలయ ప్రధానార్చకుడు పరిటాల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ఈ సందర్భంగా స్వామివారిని, అమ్మవారిని నయనానందకరంగా పుష్పాలతో అలంకరించారు. పలు రకాల స్వీట్లు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, అమ్మాజీ దంపతులు పీటలపై కూర్చుని పుష్పయాగ పూజాదికాలు నిర్వహించి, ఈ వేడుకకు పెండ్లి పెద్దలుగా వ్యవహరించారు. శ్రీ పుష్పయాగంలో భాగంగా పలు రకాల పండ్లు, స్వీట్లు స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. పూజాధికాల అనంతరం స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు ఆలయాల్లో శ్రీపుష్ప యాగాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిఫ్, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల అప్పారావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఆలయ ఈవో బాలాజీ రామ్‌ప్రసాద్, ఆలయ సిబ్బంది పెమ్మాడ వెంకటేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తోటపేటలో 361 మందికి వైద్య సేవలు



తోటపేట ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో సేవలందిస్తున్న డివిజన్ మెడికల్ ఆఫీసర్ ఎస్.ప్రశాంతి

రామచంద్రపురం రూరల్: మండలంలోని తోటపేటలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని 361 మందికి వైద్య సేవలు అందించారు. డివిజన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.ప్రశాంతి, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి ప్రసూతి వైద్య నిపుణురాలు డాక్టర్ బి.సౌమ్య, కంటి వైద్య నిపుణుడు ఎస్.కోటేశ్వరరావు వైద్య సేవలు అందించారు. అదే విధంగా వివిధ రకాల వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భిణులు తీసుకోవాల్సిన పోషకాహారం, చిన్నారుల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 261 రక్త పరీక్షలు, 48 మందికి స్పుటం పరీక్షలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ నార్ని గంగాధర్, హెచ్‌వీ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు సీహెచ్ భాస్కరలక్ష్మి, కేవీ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశాలు, హెల్త్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది సేవలందించారు.

సీతమ్మ భవనంలో చెత్త నిల్వలు

- వాసన భరించలేక పోతున్నాం
- అసాంఘిక పనులకూ నిలయం
- స్థానికుల ఆవేదన



డొక్కా సీతమ్మ భవనం వద్ద డంప్ చేస్తున్న వ్యర్థాలు

మండపేట: స్థానిక 19వ వార్డులోని శ్రీమతి డొక్కా సీతమ్మ మహిళా స్వయం శక్తి భవన ఖాళీ స్థలంలో వ్యర్థాలను డంప్ చేయడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చుట్టు పక్కల నివాస ప్రాంతాల నుంచి సేకరించిన చెత్తను తీసుకు వచ్చి భవనం వెనుక వైపు ఉన్న స్థలంలో నిల్వ చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఇక్కడ డంప్ చేసిన నాలుగైదు రోజులకు గానీ వ్యర్థాలను తీసుకెళ్లడం లేదని వారంటున్నారు. ఈలోగా వర్షం కురిస్తే ఆ చెత్త నుంచి వెలువెడుతున్న విపరీతమైన దుర్గంధాన్ని తాము భరించలేక పోతున్నామని వారు గగ్గోలు పెడుతున్నారు. తాము మున్సిపల్ కమిషనర్‌ను కలసి ఈ విషయం చెప్పగా, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయన బదులిచ్చారన్నారు. అయితే రెండు రోజులు గడిచే సరికి అదే ప్రాంతంలో వ్యర్థాలు వేస్తున్నారని వారు ఆరోపించారు. కొన్నేళ్లుగా ఇక్కడ వ్యర్థాలను డంప్ చేస్తున్నప్పటికీ మున్సిపల్ పారిశుధ్య విభాగం వారు కనీసం బ్లీచింగ్ కానీ, దోమల నివారణ మందు గానీ పిచికారీ చేయడం లేదన్నారు.

ఆకతాయిలకు అడ్డాగా..

కాగా డొక్కా సీతమ్మ భవనం ఖాళీ ప్రదేశం చుట్టూ ప్రహరీతో పాటు మూడు వైపులా గేట్లు ఉన్నాయి. అయితే ఆలనా పాలనా లేకపోవడంతో ఈ ప్రాంతం ఆకతాయిలకు అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నాయని అంటున్నారు. వల్లూరి వారి వీధి నుంచి సాయిబాబా గుడి వీధి నుంచి ఇక్కడి రోడ్డు రావుల చెరువు వీధిని కలుపుతుంది. జన సంచారం తక్కువగా ఉండే ప్రాంతం కావడంతో ఆకతాయిలు రాత్రిళ్లు ఇక్కడే బస చేసి గంజాయి సిగరెట్లు, మద్యం సేవిస్తున్నారని స్థానికుల అంటున్నారు. మత్తులో కొందరు దుండగులు గతంలో ఓ బైక్‌కు కూడా నిప్పు పెట్టి పారిపోయారని వివరించారు. దీనిపై పోలీసులు దృష్టి సారించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఈదురుగాలులతో భారీ వర్షం



వర్షానికి బురదగా మారిన గొల్లపాలెం వారపుసంత



రాయవరం ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

కాజులూరు: మండల గ్రామాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి పొడి, పొడిగా ఉన్న వాతావరణం మధ్యాహ్నం అకస్మాత్తుగా మేఘావృతమై జోరువాన ప్రారంభమయింది. ఆపై రాత్రి వరకూ చెదురుమదురుగానూ, భారీగానూ వర్షం పడటంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్రామాల్లోని పలు రహదారులు బురదగా మారటంతో సైకిళ్లు, మోటారుసైకిళ్లు ప్రయాణించేందుకు వీలు లేకుండా పోతుంది. భారీ వర్షానికి మండలంలోని గొల్లపాలెంలో నిర్వహించిన వారపుసంత చిత్తడి, చిత్తడిగా తయారై వ్యాపారులు, వినియోగదారులకు ఇబ్బందులను కలుగజేసింది. మధ్యాహ్నం వరకూ వాతావరణం అనుకూలంగా ఉండటంతో దుఖాణాలు వేసుకున్నామని తీరా వర్షం కురవటంతో తీవ్రంగా నష్టపోయామని వ్యాపారులు వాపోయారు. వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలోనూ తరచూ అంతరాయాలు ఏర్పడటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రాయవరం: రాయవరంలో శుక్రవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో కమ్ముకున్న కారుమేఘాలతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయింది.

తడిసిన ధాన్యపురాశులు

ఉరుకులు పరుగులు తీసిన రైతులు



కె.గంగవరంలో తడిసిపోతున్న ధాన్యం



తామరపల్లిలో ధాన్యం రాశులపై బరకాలు కప్పుతున్న రైతులు

కె.గంగవరం: అకాల వర్షంతో రైతులు ఉరుకులు పరుగులు తీశారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటను వర్షం నుంచి తప్పించడానికి నానాపాట్లు పడ్డారు. మండల వ్యాప్తంగా శుక్రవారం కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి పలు గ్రామాల్లోని ధాన్యం తడిసిపోయింది. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. తామరపల్లి, యర్రపోతవరం, బాలాంత్రం, మసకపల్లి, కుడుపూరు పాణింగపల్లి, కుందూరు, రాయిచెరువు, కె.గంగవరం, అద్దంపల్లి, భట్లపాలిక గ్రామాల్లో వర్షం పడడం వల్ల ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. ఆకాశం మేఘావృతం కావడంతో రైతులు ఉరుకులు పరుగుల మీద పొలాలకు వెళ్లి ధాన్యం రాశులపై బరకాలు కప్పి రక్షించుకున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న ఈ తరుణంలో వర్షం పడడం రైతులు కొంత వరకు నష్టపోయారు. మరో రెండు వారాల పాటు వాతావరణం అనుకూలిస్తే ఆరుగాలం శ్రమించిన పంట చేతికందుతుందని రైతులు ఆలోచిస్తున్నారు. కానీ వాతావరణం అనుకూలించకపోవడం వల్ల వారు ఆందోళన చెందుతున్నారు.

చదవడం అలవాటు చేసుకోవాలి

అంబాజీపేట: భారత స్వాతంత్ర్య సమరయోధుల పుస్తకాలు, జనరల్ నాలెడ్జ్, కథల బుక్స్‌ను చిన్నతనం నుంచి అలవాటు చేసుకుంటే ఎన్నో విషయాలు తెలుస్తాయని గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ జి.శ్రీనివాస్ అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షన తరగతుల్లో భాగంగా శుక్రవారం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు ఆరోగ్యం, అలవాట్లు, ప్రకృతి జీవన విధానంపై అవగాహన కల్పించారు. డ్రాయింగ్, ఇంగ్లీష్ సాహిత్యం, యోగా తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు.

శాంతి సమావేశం

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో శాంతి సమావేశం నిర్వహించారు.